ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీసత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024



ప్రశాంతి నిలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు







నృత్యరూపకంలోని ఓ సన్నివేశం



పెనుకొండలో వేణుగోపాల స్వామి రథాన్ని నడుపుతున్న మంత్రి సవిత

హే.. కృష్ణా..

అట్టహాసంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రశాంతి నిలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

పుట్టపర్తి, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి వేడుకలను జిల్లావ్యాప్తంగా సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. కృష్ణ నామస్మరణతో జిల్లా మార్మోగింది. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, డీమ్డ్ యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి.. గోవులు, లేగదూడలకు పండ్లు, పాలు అందించారు. అనంతరం విద్యార్థులు భక్తిపాటలు, నృత్యంతో అలరింపజేశారు. పెనుకొండలో వేణుగోపాల స్వామి రథోత్సవంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. రథాన్ని స్వయంగా నడిపారు. హిందూపురం, మడకశిర, ధర్మవరం కేంద్రాల్లో వేణుగోపాల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కదిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు.. స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మవరంలోని చెన్నకేశవ ఆలయం వద్ద గోపాలుడి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని గోకులంలో యాదవులు కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.



గోవుకు పాలు తాపిస్తున్న ఆర్జే రత్నాకర్

అలరించిన సంకీర్తన సాక్షాత్కారం

పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన 'సంకీర్తన సాక్షాత్కారం.. సంగీతం..' నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. విశాఖ జిల్లాకు చెందిన భక్తులు రెండో రోజు సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలను కొనసాగించారు. పాండురంగ చరిత్రలోని ఘట్టాలను నృత్యరూపకం ప్రదర్శించారు.

సాయి కుల్వంత్ సభా మండపంలోని శ్రీకృష్ణుడి విగ్రహం



పురంలో చిన్నికృష్ణుడు



ప్రశాంతి నిలయంలో చిన్నారుల నృత్యం



బీడుగా మారిన చెరువు ఆయకట్టు

నీటి బొట్టు.. వదిలిపెట్టు..!

నీటి పారుదల శాఖపై వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం

మడకశిర, ఆగస్టు 26: మారుమూల, కొండల మధ్య ఉంటుంది మడకశిర నియోజకవర్గం. సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉంటుంది. అతి తక్కువ వర్షపాతం నమోదవుతుంది. నీటి వనరులూ లేవు. రిజర్వాయర్లూ లేవు. వర్షపు నీరే దిక్కు. ఆ నీటితోనే పంటలు పండించుకోవాలి. వర్షాలు కురవకపోతే తాగడానికి కూడా నీరు దొరకదు. పంటలు పండక చాలా రైతు కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాయి. వేల అడుగులు బోర్లు తవ్వినా చుక్క నీరు దొరకదు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చెరువుల తూములు 15 ఏళ్ల క్రితం మూసివేశారు. ఆయకట్టు భూములను పూర్తిగా బీడుగా వదిలేశారు. దీనిని బట్టి ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు ఎంత అధ్వానంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ప్రాంతంలో నీటిని ఒడిసిపట్టడంపై కూడా గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు చెరువులన్నీ నిండాయి. పలు చెరువులకు లీకేజీలు ఏర్పడ్డాయి. వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆ పనులు చేసిన కాంట్రాక్టర్లకు నేటికీ నిధులివ్వలేదు. చెరువులకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోతే భారీ వర్షాలకు తెగిపోయే ప్రమాదం ఉందని నిపుణులు, రైతులు వాపోతున్నారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకున్న గత వైసీపీ పాలకులు ఆ దిశగా అడుగు ముందుకేయలేదు. చెరువుల పూర్తిస్థాయి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపి, సరిపెట్టారు. నిధులిచ్చిందీ లేదు, పనులు చేసిందీ లేదు. ప్రస్తుతం భారీ వర్షాలు కురిస్తే చెరువులు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు అందోళన చెందుతున్నారు. తమది రైతు ప్రభుత్వమని డప్పులు కొట్టుకున్న గత వైసీపీ పాలకులు.. రైతుల ప్రయోజనాల పరిరక్షణపై చూపిన శ్రద్ధకు చెరువు మరమ్మతులే నిదర్శనం. అంతేకాదు, గత ఐదేళ్లూ నీటి పారుదల శాఖపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. పైసా నిధులిచ్చిన పాపాన పోలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

ఐదేళ్లూ నిధులివ్వని వైనం
చెరువు లీకేజీలకు తాత్కాలిక మరమ్మతులతో సరి
వాటికీ బిల్లులు చెల్లించని దుస్థితి
కార్యాలయాల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణ
అటకెక్కిన పూర్తిస్థాయి మరమ్మతులు
రూ.88.95 కోట్లతో ప్రతిపాదనలు
నిధులివ్వని గత ప్రభుత్వం

అడుగంటిన భూగర్భ జలాలు

మడకశిర ప్రాంత రైతులు వర్షాధారంగా, బోర్ల కింద పంటలు సాగు చేసుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. తాగు, సాగునీటికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో 1000 అడుగలు తవ్వివా చుక్క నీరు దొరకడం కష్టం. తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. భూగర్భజలాలను పెంపొందించేందుకు అధికారులు 15 సంవత్సరాల క్రితం చెరువుల తూములను మూసి వేశారు. వెరసి వేలాది ఎకరాల ఆయుకట్టు బీడుగా మారి బండబారిపోతోంది. రైతులు ఆయకట్టు భూముల్లో బోర్లను తవ్వించుకుని, ఆ నీటితో పంటలు సాగు చేసుకుంటున్నారు. వర్షాలు కురిసి చెరవులకు నీరు చేరినా పలుచోట్ల తూముల ద్వారా, మరికొన్ని చోట్ల కట్టలకు గండ్లు పడి నీరు వృథా అవుతోంది. వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా భారీ వర్షాలు కురిస్తే అవి మరింత దెబ్బతిని నీరు వృథా అయ్యే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లగా నిధులు మంజూరుకాకపోవడంతో చెరువులు మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోయి తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



నెర్రెచీలిన కెంకర చెరువు కట్ట

బిల్లుల కోసం ప్రదక్షిణ

నీటి పారుదల శాఖలో నీరు-చెట్టు కింద పనులు చేసి మూడేళ్లయినా బిల్లులు అందలేదు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రొళ్ల మండలంలో రంగాపురం వద్ద చెరువుకట్ట నుంచి లీకేజీ, అగళి వద్ద ఫీడర్ చానల్ తెగిపోయింది. అగళి చెరువు మరువ లీకేజీతో నీరు వృథా అయింది. వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. నీరు-చెట్టు కింద పలుచోట్ల దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా.. నేటికీ నిధులు మంజూరు కాలేదు. తాత్కాలిక మరమ్మతులకు బిల్లులు చెల్లించలేదు. వీటి మరమ్మతులకు ఎస్‌డీపీ కింద రూ.3.14 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పిలిచారు. అగ్రిమెంట్ దశలో ఆగిపోయింది. దీంతో నిధులు వెనక్కి మళ్లాయి, పనులు ఆటకెక్కాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.



అగళి చెరువులో పెరిగిపోయిన కంపచెట్లు




అగళి ఫీడర్ చానల్ తెగిపోయి వృథా అవుతున్న నీరు (ఫైల్)

పూర్తిస్థాయి మరమ్మతుల ఊసేదీ?

దెబ్బతిన్న చెరువులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. పలుచోట్ల చెరువుల్లో పూడిక పేరుకుపోయి కంపచెట్లు పెరిగిపోయాయి. కట్టలు బలహీనపడ్డాయి. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పలు చెరువుల తూములు, కట్టల వద్ద లీకేజీలు ఏర్పడి, నీరు వృథాగా పోయింది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడంలేదు. తాత్కాలిక మరమ్మతులకు కూడా నేటికీ బిల్లులు చెల్లించలేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. చెరువులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోతే భారీ వర్షాలు కురిసినపుడు మళ్లీ అవి దెబ్బతినే అవకాశం ఉంది. తెగిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. 2020-2021 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలకు 32 చెరువులు దెబ్బతిన్నాయి. తాత్కాలికంగా వాటి మరమ్మతులను ఇరిగేషన్ శాఖ.. చెరువు ఆయకట్టుదారులతో కలిసి చేపట్టారు. అందుకు ఖర్చు పెట్టిన డబ్బు నేటికీ మంజూరుకాలేదు.

రూ.88.95 కోట్లతో ప్రతిపాదనలు

మడకశిర నియోజకవర్గంలో చెరువుల మరమ్మతులకు 89 పనులకు రూ.88.95 కోట్లతో ప్రతిపాదనలు పంపి, మూడేళ్లు పైబడుతోంది. నేటికీ నిధులు మంజూరుకాలేదు. అగళి మండలంలో 20 చెరువులకు రూ.18.50 కోట్లు, అమరాపురం మండంలో 19 చెరువులకు రూ.19.80 కోట్లు, రొళ్లలో 13కి రూ.11.92 కోట్లు, గుడిబండ పరిధిలో 18కి రూ.17.70 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. చెరువు కట్టలపై కంపచెట్లు దట్టంగా పెరిగాయి. కట్టలు, తూముల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వర్షాలు వచ్చినపుడల్లా నీరు లీకేజీ అయి, వృథా అవుతోంది. తూముల మరమ్మతులు చేపడితే నీటి వృథా అరికట్టే అవకాశం ఉంది. చెరువు కట్టపై ఉన్న ముళ్లకంపలను తొలిగిస్తే కట్ట భద్రంగా ఉంటుంది. పూడికను తొలిగిస్తే నీరు నిలబడి భూగర్భ జలాలు పెంపొందే వీలుంటుందని రైతన్నలు పేర్కొంటున్నారు.



ప్రతిపాదనలు పంపాం

ఆర్అండ్ఆర్ కింద 89 చెరువుల మరమ్మతులకు రూ.88.95 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులను చేపడతాం. 2020-2021 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. వాటికి బిల్లులు చెల్లించాల్సి ఉంది.

- శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ



సైదం ఆంజనేయులు

రూ.2.25 కోట్లకు కుచ్చుటోపీ

ధర్మవరం, ఆగస్టు 26: పట్టణానికి చెందిన చిట్టీల నిర్వాహకుడు, ఫైనాన్స్ వ్యాపారి జనాలకు రూ.కోట్లలో కుచ్చుటోపీ పెట్టి, ఉడాయించాడు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక శివానగర్‌కు చెందిన సైదం ఆంజనేయులు కొన్నేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తూ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండేవాడు. దాదాపు 82 మంది నుంచి రూ.2.25కోట్లు అప్పుగా తీసుకున్నాడు. అతడి తీరుపై అనుమానం వచ్చి అప్పులు ఇచ్చివారు డబ్బు డిమాండ్ చేశారు. దీంతో అతడు కుటుంబంతో గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించాడు. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని.. అర్ధనగ్నంగా..

కొనసాగిన తాగునీటి కార్మికుల ఆందోళన

నల్లమాడ, ఆగస్టు 26: సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు ఐదోరోజు సోమవారం కూడా ఆందోళన కొనసాగించారు. మండలంలోని పంప్‌హౌస్‌లో కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని, అర్ధనగ్నంగా మోకాళ్లపై నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఐదురోజులుగా నిరసనలు చేపడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్నారు. ఆరు నెలలుగా జీతాలు అందలేదన్నారు. దీంతో కుటుంబ పోషణ దుర్భరంగా మారిందని ఆవేదన చెందారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటేష్, శకంర్, షామీర్, నాగభూషణ, ఎస్ఎం. బాషా, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

పరిహారం కోసం పోరు

నేటి నుంచి భూనిర్వాసితుల వంటావార్పు

సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

పెనుకొండ, ఆగస్టు 26: గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామం వద్ద నాసిన్, బెల్ కంపెనీలకు భూములిచ్చిన రైతు కుటుంబాలకు పరిహారం పంపిణీ చేయాలని కోరుతూ ఆందోళనకు దిగుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నుంచి 48 గంటల పాటు వంటావార్పు ద్వారా నిరసన తెలుపుతామన్నారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. నాసిన్, బెల్ ఏర్పాటుకు పాలసముద్రం, చిన్నబాబయ్యపల్లి, కావేటినాగేపల్లి గ్రామాల రైతులు భూములు ఇచ్చారన్నారు. వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి పోరాటాలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి వంటావార్పు చేపడుతున్నామన్నారు.

ఓపీఎస్ మాత్రమే..

జీపీఎస్, యూపీఎస్ వద్దు: యూటీఎఫ్

ధర్మవరం, ఆగస్టు 26: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) తప్ప మరే ఇతర పెన్షన్ స్కీములు వద్దని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం ధర్మవరం జోన్ నాయకుల సమావేశం నిర్వహించారు. శెట్టిపి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు చేస్తామని చెబుతున్న గ్యారెంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్) తరహాలోనే కేంద్ర ప్రభుత్వం కూడా స్వల్ప మార్పులతో యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తోందన్నారు. యూపీఎస్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అదనంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. సీపీఎస్, జీపీఎస్‌ను ప్రభుత్వాలు వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

ఘోరం

- బీసీ హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి
- మెడకు గాయాలు లేవు.. కాలిపై ఎవరిదో సెల్ నంబర్
- ఆత్మహత్య కాదని విద్యార్థి తండ్రి అనుమానం



కన్నీటి పర్యంతమవుతున్న విద్యార్థి తండ్రి లింగమయ్య

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న ఓ విద్యాకుసుమం రాలిపోయింది. నగరంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంటర్ విద్యార్థి తేజ(17) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన లింగమయ్య కుమారుడు తేజ నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బీసీ బాయ్స్ కాలేజీ హాస్టల్‌లో వసతి పొందుతున్నాడు. హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో కడ్డీకి సోమవారం సాయంత్రం ఉరి వేసుకుని కనిపించాడు. తేజ మంచివాడని, ఎవరితోనూ గట్టిగా మాట్లాడేవాడు కాదని సహ విద్యార్థులు అంటున్నారు. వారంక్రితం నుంచి తన ఆరోగ్యం బాగాలేదని అన్నారు. విద్యార్థి ఉరివేసుకున్నా.. గొంతుపై ఎలాంటి గాయాలు లేవు. విద్యార్థి కాలిపై ఒక మొబైల్ నంబర్ ఉంది. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియడం లేదని హాస్టల్ వార్డెన్, బీసీ సంక్షేమశాఖ అధికారులు అంటున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి లింగమయ్య స్వగ్రామం నుంచి వచ్చాడు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న తన కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. ఏదో జరిగిందని, తన కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని కన్నీరు మున్నీరయ్యాడు. న్యాయం చేయాలని అధికారులకు విన్నవించాడు. కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వస్తే మృతికి కారణమేమిటో తెలుస్తుందని నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ అన్నారు. విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సోమవారం రాత్రి నిరసనకు దిగాయి. విద్యార్థి ఆరోగ్యం బాగాలేకపోయినా, ఎవరో కొడుతున్నా హాస్టల్ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. అధికారులు నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు.



విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత, కలెక్టర్, ఎమ్మెల్యే శ్రావణి

విమానాశ్రయం కావాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ బృందం సభ్యులు

కూడేరు, ఆగస్టు 26: జిల్లాలో రైతులు పండించిన పండ్లను ఎగుమతి చేయడానికి కూడేరు మండలంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను వారు సోమవారం పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల పంటలు పండించినా గిట్టుబాటు ధర, మార్కెట్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే రైతులు తమ పంటలను కార్గో విమానాల ద్వారా మంచి ధర ఉన్న ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకోవచ్చన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు జిల్లా కేంద్రానికి ఆనుకుని, ప్రభుత్వ భూమి అధికంగా ఉన్న కూడేరు మండలం అనువుగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ తీసుకొని మెగా డ్రిప్ పథకం అమలు చేసి, రైతుల ఆశలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ బృందం సభ్యులు మల్లికార్జు న, నారాయణ స్వామి, రాజారెడ్డి, సంజీవయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు, మల్లికార్జున, పార్వతీ, పెరుగుసంగప్ప, మండల కార్యదర్శి నాయణమ్మ, రమణ, రమణప్ప, శ్రీరాములు, కాశింపీరా, ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

- ఆస్పత్రికి మంత్రి రాకతో రద్దీ
- అంబులెన్స్‌ను పట్టించుకోని వైద్యులు, సిబ్బంది
- ప్రాణాలు వదిలిన ముదిగుబ్బవాసి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: సర్వజన వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది. జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి సవిత.. సోమవారం రాత్రి ఆస్పత్రికి వచ్చారు. అత్యవసర చికిత్స విభాగంలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం సహ విద్యార్థులు, కుటుంబ సభ్యులు, హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడారు. ఆ తరువాత మీడియాతో మంత్రి మాట్లాడారు. ఇదే సమయంలోముదిగుబ్బకు చెందిన వెంగముని(45) ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ.. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి నుంచి రెఫర్‌పై అనంతపురం సర్వజన వైద్యశాలకు వచ్చాడు. అత్యవసర విభాగం వద్ద మంత్రి రాక కారణంగా రద్దీ ఉండటం, వైద్యులు అందరూ మంత్రి వద్ద ఉండటంతో అంబులెన్స్‌లో ఉన్న వెంగముని గురించి ఎవరూ పట్టించుకోలేదు. దీంతో వెంగముని అంబులెన్స్‌లోనే మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్యుల తీరుపై మండిపడ్డారు. మంత్రి సవిత, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు ఒకేసారి ఆస్పత్రికి రావడంతో రద్దీ ఏర్పడింది. వీరి రాకకోసం విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించకుండా అత్యవసర విభాగంలోనే ఉంచారని, ఇది కూడా వెంగముని మృతికి కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి.



అంబులెన్స్‌లో మృతిచెందిన వెంగముని, విలపిస్తున్న కుటుంబ సభ్యులు

న్యాయం చేస్తాం: మంత్రి సవిత

హాస్టల్లో మృతి చెందిన విద్యార్థి తేజ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఆమె విద్యార్థి తేజ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం హాస్టల్‌లోని సహచర విద్యార్థులు, తండ్రి లింగమయ్యతో వివరాలు ఆరా తీశారు. ఇందుకు తండ్రి లింగమయ్య కాళ్ల తిమ్మిర్లు ఉన్నాయంటూ ఇంటికి వచ్చాడని.. అందుకు వైద్యం చేయించి పంపామని తెలిపాడు. నా కొడుకు ఇలా చనిపోతాడని అనుకోలేదు, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు అని అన్నాడు. మంత్రి వైద్యులు పిలిపించి విద్యార్థి వాడిన మందులను పరిశీలించారు. అనంతరం వార్డెన్ ఈరన్నను పిలిపించి ఆరా తీశారు.

30న యూటీఎఫ్ నిరసనలు

అనంతపురం విద్య, ఆగస్టు 26: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 30న నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన తెలుపనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ రద్దు చేయకుండా యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో కేంద్రప్రభుత్వం కొత్త స్కీంను తీసుకురావడాన్ని జిల్లా యూనియన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్రం తేవాలనుకుంటున్న యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 30న నిరసనలు తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి: ఎంపీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, ఆగస్టు 26: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగు చ ర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎస్పీ జగదీష్‌ను కో రారు. సోమవారం స్థానిక పోలీసు అతిథి గృహంలో ఎస్పీని ఎంపీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతపురంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సిబ్బందిని పెంచాలన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

ఫిలాటెలీ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

- తపాలాశాఖ సూపరింటెండెంట్ గుంపస్వామి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: తపాలా బిళ్లల సేకరణపై విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన దీన్ దయాల్ స్పర్ష్ యోజన ఫిలాటెలీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ సూపరింటెండెంట్ గుంపస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఆరు నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ పరీక్షకు అర్హులన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఎస్సీఎస్టీలకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పిస్తారన్నారు. ఈ పరీక్ష రెండు విభాగాలుగా నిర్వహిస్తామన్నారు. ఈ రెండు విభాగాలలో ఉత్తీర్ణత సాధించిన వారికి రూ. 6 వేలు స్కాలర్‌షిప్ అందజేస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ, స్కూల్ ప్రిన్సిపాళ్ల ద్వారా గానీ ఫిలాటెలీ డిపాజిట్ అకౌంట్ రూ. 200తో అనంతపురంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ప్రారంభించాలన్నారు. వివరాలను అప్లికేషన్‌కి జతచేసి పోస్టుమాస్టర్ జనరల్ కర్నూల్ రీజియన్ కర్నూలు 518002కు పంపాలన్నారు. విద్యార్థులు పంపే కవరుకు ఫిలాటెలీ స్టాంపును అతికించి స్పీడ్ పోస్టు ద్వారా పంపాలన్నారు. ఒక కవర్లో ఒక అప్లికేషన్ మాత్రమే పంపాలన్నారు. సెప్టెంబరు 16లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు అనంతపురం డివిజనల్ పోస్టాఫీసును సంప్రదించాలన్నారు.

కుర్చీలపై చర్చ

డ్వామా, డీఆర్‌డీఏ పీడీల నియామకంపై వీడని సస్పెన్స్



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26: జిల్లాలో కీలక శాఖలైన డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు పీడీల నియామకంపై సస్పెన్స్ కొనసాగుతోంది. జైళ్లశాఖ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి డ్వామా పీడీగా వచ్చి ఐదేళ్ల కాలం కావస్తోంది. డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా చేసిన నరసింహారెడ్డి వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఎవరికైనా ప్రభుత్వం బాధ్యతలు అప్పగిస్తే రిలీవ్ కావడానికి సిద్ధంగా ఉన్నారు. ఇద్దరు పీడీలు వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈక్రమంలోనే టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు కావస్తున్నా కీలక శాఖలకు పీడీలను నియమించలేకపోతున్నారనే అసంతృప్తి కూటమి శ్రేణులు, అటు ఆయా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

డ్వామా పీడీగా రామాంజనేయులు?

ప్రస్తుతం అందరి చూపూ డ్వామా పీడీ నియామకంపై పడింది. డ్వామా పీడీగా అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు వస్తారంటూ ప్రచారం ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధితో ఉన్న అనుబంధం రామాంజనేయులు నియామకానికి అడ్డంకిగా మారిందని సమాచారం. డీఎల్‌డీఓ రామాంజనేయులు వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, బీసీ కార్పొరేషన్‌ల ఈడీగా, శ్రీసత్యసాయి జిల్లా డ్వామా పీడీగా పని చేశారు. వైసీపీ పాలనలో కీలక పోస్టుల్లో పనిచేసిన రామాంజనేయులును డ్వామా పీడీగా నియమిస్తారనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో అందరి దృష్టి ఆయనపై పడింది. డ్వామాలో ఏపీడీగా ఉన్న సుధాకర్‌రెడ్డి పీడీగా వస్తారనే ప్రచారం కూడా ఉంది. డ్వామాలో ఉపాధి హామీ పథకం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎంపీడీఓ శైలజ కూడా పీడీ పోస్టుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ శాఖలో ఏడీగా పనిచేస్తున్న అల్తాఫ్ కూడా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఎవరికి వారు కూటమి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంలోని పెద్దలు, రాష్ట్రస్థాయి అధికారుల ద్వారా డ్వామా పీడీగా రావాలని ప్రయత్నిస్తున్నారు.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఎవరో?

జిల్లాలో కీలక శాఖల్లో డీఆర్‌డీఏ-వెలుగు ఒకటి. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా పనిచేసిన ఎంపీడీఓ నరసింహారెడ్డి కూటమి అధికారంలోకి రాగానే సెలవుపై వెళ్లారు. దీంతో ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. అంతలోనే డీఎల్‌డీఓగా ఉన్న ఓబుళమ్మను ఎఫ్ఏసీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఓబుళమ్మకు తాజాగా జడ్పీ సీఈఓగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఈమె ప్రస్తుతం జడ్పీ సీఈఓగా, డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా, డీఎల్‌డీఓగా, స్వీప్ స్పెషల్ ఆఫీసర్‌గా, మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఐదు పోస్టులలో పనిచేస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు కలెక్టర్ వినోద్ కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్యకు అప్పగిస్తారా లేక కొత్త వారిని నియమిస్తారా అనేది సస్పెన్స్‌గా నిలుస్తోంది. గతంలో జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేసిన డీఎల్‌డీఓ శ్రీనివాసులు, సహకార శాఖలో పనిచేస్తున్న నారాయణస్వామి డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా వస్తారనే ప్రచారం జరుగుతోంది.

సబ్సిడీ ధర ఖరారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేటి నుంచి ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు

అనంతపురం అర్బన్, ఆగస్టు 26: ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా కోసం సోమవారం టెండర్లు ఖరారు చేశారు. అలాగే సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. అన్ని విత్తనాలకు 80 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఎప్పుడో..? అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన పంటలు ఆశించిన స్థాయిలో సాగు చేయలేకపోవడంతో జిల్లాకు 27907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఇందులో ఉలవలు 21791 క్వింటాళ్లు, పెసలు 1501, అలసంద 3253, జొన్న 973, కొర్ర 369, మినుమిలు 20 క్వింటాళ్లను కేటాయించారు.



గుత్తిలో ప్రాసెసింగ్ చేసిన ప్రత్యామ్నాయ విత్తనాలు

నేటి నుంచి రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు

జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి ప్రత్యామ్నాయ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, గుత్తి, బెళుగుప్ప, ధర్మవరం,కదిరి ప్రాంతాల్లోని యూనిట్లల్లో ప్రత్యామ్నాయ విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ సోమవారం ఆరంభమైనట్లు ఏపీసీడ్స్ అధికారులు పేర్కొన్నారు. మరో మూడు రోజుల్లో విత్తన పంపిణీ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సబ్సిడీ ధరలు ఖరారు ఇలా..

విత్తన రకం	పరిమాణం	పూర్తి ధర	సబ్సిడీధర	రైతు వాటా
పెసలు	4 కేజీలు	13000	10400	2600
మినుములు	4 కేజీలు	14000	11200	2800
కొర్ర	2 కేజీలు	8740	6992	1748
జొన్న	3కేజీలు	700	560	140
ఉలవలు	10 కేజీలు	8700	6960	1740
అలసంద	8 కేజీలు	11300	9040	2260

ఎకరాల వారీగా ప్యాకెట్ల పంపిణీ

ప్రత్యామ్నాయ విత్తనాలను ఎకరాల వారిగా పంపిణీ చేయాలని నిర్ణయించారు.

ఉలవలు (10 కేజీల ప్యాకెట్) అర ఎకరా నుంచి ఎకరా దాకా 1 ప్యాకెట్, 1.5 ఎకరాల నుంచి 2 ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి 5 ఎకరాల దాకా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.

- అలసంద (8 కేజీల ప్యాకెట్) అర ఎకరా నుంచి ఎకరా దాకా 1, 1.5 ఎకరాల నుంచి 2 ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి 5 ఎకరాల దాకా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.
- మినుములు, పెసలు (4 కేజీల ప్యాకెట్) అర ఎకరా దాకా 1 ప్యాకెట్, ఎకరా దాకా 2, 1.5 ఎకరా దాకా 3, 2 ఎకరాల దాకా 4, 2.5 ఎకరాల దాకా 5, 3 ఎకరాల దాకా 6, 3.5 ఎకరాల దాకా 7, 4 ఎకరాల దాకా 8, 4.5 ఎకరాల దాకా 9, ఐదు ఎకరాల దాకా 10 ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.
- కొర్ర 2 కేజీల ప్యాకెట్ అర ఎకరా నుంచి ఎకరా దాకా 1 ప్యాకెట్, 1.5 ఎకరాల నుంచి రెండు ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి ఐదెకరాల దాకా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.
- జొన్న (3 కేజీల ప్యాకెట్) అర ఎకరా నుంచి ఎకరా దాకా 1, 1.5 ఎకరాల నుంచి 2 ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి 5 ఎకరాల దాకా ఐదు ప్యాకెట్లు అందజేస్తారు.

పీఆర్‌లో సజావుగా బదిలీ కౌన్సెలింగ్



బదిలీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

అనంతపురం సిటీ, ఆగస్టు 26: రాయలసీమ జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం స్థానిక జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయంలో సజావుగా జరిగింది. ఆ ఆశాఖ ఈఎన్‌సీ బాలూనాయక్ ఆయా జిల్లాల ఎస్ఈలతో కలిసి ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదట చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన డీఈఈల కౌన్సెలింగ్ నిర్వహించారు. తర్వాత జిల్లాల వారిగా జేఈ(ఏఈఈ), ఏఈ, టీవో , ఏటీఓ, జేటీవో, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బందిని బదిలీలు చేశారు. నాలుగు జిల్లాలకు చెందిన పీఆర్ ఉద్యోగులు ఒక్కసారిగా కౌన్సెలింగ్ ప్రక్రియకు తరలిరావడంతో స్థానిక ఆశాఖ కార్యాలయం కిటకిటలాడింది.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, ఆగస్టు 26: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 3450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.7పలికినట్లు ఆయన తెలిపారు.

పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు

కసరత్తు చేస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబులమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా ఉద్యోగుల బదిలీ చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబులమ్మ తెలిపారు. ఉద్యోగుల బదిలీలపై సోమవారం సోమవారం ఆమె డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో కసరత్తు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల వివరాలు ఇప్పటికే సేకరించారు. సీనియార్టీ, రిక్వెస్ట్, ఒకే చోట ఐదేళ్లు పూర్తి అయిన ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో మొత్తం 195మంది ఉద్యోగులు ఉండగా 41మంది ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ స్థాయిలో ఏపీడీ ఈశ్వరయ్య, డీపీఎం ఎంకే సత్యనారాయణ, రాయదుర్గం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్‌లకు ఐదేళ్లు పూర్తికావడంతో బదిలీ కావాల్సి ఉంది. ఇక ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఏపీఎంలు ఉరవకొండ గంగన్న, బీమా సెంటర్ హరిప్రసాద్, లైవ్లీహుడ్స్ శ్రీనివాసులు, శింగనమల నారాయణస్వామి, పామిడి అరుణ, శెట్టూరు సర్దానప్ప, వజ్రకరూరు గుణశ్యామ్, ఆత్మకూరు మదన్‌మోహన్‌లు తప్పక బదిలీ చేయాల్సిందే. వీరితో పాటు ముగ్గురు డీపీఎం లు, ఏపీఎంలు మరో ఏడుగురు, సీసీలు 28 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇక శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 253మంది ఉద్యోగులు ఉండగా 47మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఏపీఎంలు చిలమత్తూరు భారతమ్మ, గోరంట్ల నారాయణ, అమరాపురం బీటీ తిప్పన్నలకు ఐదేళ్ల కాలం పూర్తి అయ్యింది. వీరు తప్పక బదిలీ కావాలి. వీరితో పాటు మరో 16మంది ఏపీఎంలు, 36మంది సీసీలు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజుల్లో శ్రీసత్యసాయి జిల్లా పీడీ నరసయ్యతో చర్చించి బదిలీలపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈనెల 31న బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని, ఒకటిన బదిలీ అయిన స్థానంలో విధుల్లో చేరాల్సి ఉందని పీడీ తెలిపారు.

దులీప్‌ట్రోఫీ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్



పిచ్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న బీసీసీఐ క్యూరేటర్ సమందర్‌సింగ్, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26: దులీప్‌ట్రోఫీ-2024 నిర్వహణ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను నియమించారు. వైస్‌చైర్మన్‌గా లార్డ్ ప్రకాష్‌రెడ్డి, సెక్రటరీగా మాజీ క్రికెటర్ షాబుద్దీన్, కన్వీనర్‌గా జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులుగా ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏసీఏ మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్, పగడాల మల్లికార్జున, మాజీ ఉపాధ్యక్షుడు జొన్నా జయప్రకాష్, ఏసీఏ కోచ్ యుగంధర్‌రెడ్డి నియమితులయ్యారు. పిచ్ ఏర్పాటుకు సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో బీసీసీఐ క్యూరేటర్ సమంధర్ సింగ్ భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. లైవ్ టెలికాస్ట్‌కు అవసరమైన టవర్లను నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 5నుంచి 23వరకు దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. జిల్లా క్రికెట్ చరిత్రలో బ్రాడ్‌కాస్టింగ్ రూం ఏర్పాటు చేయడంలో బీసీసీఐ చొరవ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతి ఒక్కరికీ ఉచితంగా పాసులు అందజేస్తామని, క్రికెట్ అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. క్రికెట్ దిగ్గజాలు ఈ పోటీల్లో పాల్గొననుండటంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు పాటించి, పిచ్ ఏర్పాటు, ఇతర సదుపాయాలు, భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వాడవాడలా గోకులాష్టమి



ధర్మవరం ఇస్కాన్ మందిరంలో జగన్నాథ్, సుభద్ర, బలరామ ప్రతిమలు ▲

శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ▼





ధర్మవరం: అలంకరణలో శ్రీకృష్ణుడి మూలవిరాట్

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా గోకులాష్టమిని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి ప్రతిమలను ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. వివిధ పాఠశాలలో ఈ వేడుకలు ఉత్సహంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



పుట్టపర్తిలో అలంకరణలో శ్రీకృష్ణుడు



కదిరి షిర్డీసాయి హైస్కూల్‌లో ఉట్టికొడుతున్న చిన్నారులు



పుట్టపర్తిలో ఉట్టికొడుతున్న యువకులు





ఓడీసీ వశిష్ట, రెయిన్‌బో పాఠశాలల్లో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



గాండ్లపెంట మండలం సోమయాజులపల్లిలో..



నల్లమాడ మండలం గోపేపల్లిలో బాలాజీ విద్యాసంస్థల విద్యార్థులు



ధర్మవరంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు



కొత్తచెరువు వివేకానంద పాఠశాలలో...



ముదిగుబ్బలో స్వామివారి ప్రతిమకు అలంకరణ



నల్లచెరువు గీతామందిరంలో..

ముగ్గురి బైండోవర్

నంబులపూలకుంట, ఆగస్టు 26: తలుపుల మండల తహసీల్దార్ ఎదుట ముగ్గురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీధర్ సోమవారం తెలిపారు. తలుపుల మండలంలోని చంద్రనాయక్ తండాలో అతి వేగంగా జీపులో వెళ్తుండగా, గ్రామస్థులు పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతానికి ఎస్ఐతో పాటు తలుపుల, ఎన్పీకుంట పోలీసులు చేరుకుని తనిఖీ చేయగా, అనుమానస్పందగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని అన్నమయ్య జిల్లా కాటిమానుగుంత జిల్లాపరిషత్ పాఠశాలలో హిందీ పండింట్‌గా పనిచేస్తున్న కదిరుల్లా, కడప జిల్లాకు చెందిన సిద్దరామప్పనాయుడు, ఎన్పీకుంట మండలంలోని గౌనకపేటకు చెందిన వెంకట సుబ్బారెడ్డిగా గుర్తించారు. కదిరుల్లా వద్ద లైసెన్స్ ఉన్న తుపాకి ఉన్నట్లు గుర్తించారు. వీరు ముందస్తుగా ఎలాంటి నేరాలకూ పాల్పకుండా విచారించడానికి తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.

విశ్వహిందూపరిషత్ కమిటీ ఎంపిక

నల్లమాడ, ఆగస్టు 26: మండల విశ్వహిందూపరిషత్ నూతన కమిటీని సోమవారం స్థానిక నాగలకట్ట వద్ద ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా బుట్టి నాగభూషణనాయుడు, ఉపాధ్యక్షుడిగా బైప్పరెడ్డి, కార్యదర్శులుగా రవికుమార్, ఆదిమూలం అశోక్‌కుమార్, ముద్దనూరు నరసింహులు, రామాంజి, కోశాధికారిగా మహేంద్రనాయక్, సభ్యులుగా ఎనిమిది మందిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ సభ్యులు గోరంట్ల అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి రమేష్, శ్రీనివాగుప్త, వనజ, లీలావతి, అంజనేయులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం



రుణ పత్రాలు అందుకున్న మహిళలతో విశాలా ఫెర్రర్

నల్లమాడ, ఆగస్టు 26 : మండలంలోని ఆర్డీటీ మహిళ సంఘాల సభ్యుల కోసం స్థానిక రామాలయం వీధిలో ఆదర్శ మహిళ కో-ఆపరేటివ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని విశాల ఫెర్రర్ సోమవారం ప్రారంభించారు. ఏటీఎల్ వన్నూరుస్వామి మాట్లాడుతూ.. మండలంలోని 32 గ్రామాలకు సంబంధించిన 1600 మంది మహిళల ఆర్థికాభివృద్ధికి ఈబ్యాంక్ ఏర్పాటు చేశామని, బ్యాంక్‌ను రూ.45 లక్షలతో ప్రారంభించామని, రూ.15 లక్షలు మహిళలకు రుణాలు అందించామని అన్నారు. బ్యాంక్ ఆఫ్ డైరెక్టర్‌గా ఉన్న 15మంది సభ్యులు ఈ బ్యాంక్‌ను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, బాషా, నరసింగరావు, లక్ష్మణ, రాంప్రతాప్‌రెడ్డి, కేశవమూర్తి, తిప్పమయ్య, శ్రీనివాసులు, గంగప్ప, కుళ్లాయమ్మ, గీత,నాగరాజు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి వేమన సాహితీ పురస్కారం

కదిరి అర్బన్, ఆగస్టు 26 : పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చింతా నాగరాజుకు వేమనసాహితీ పురస్కారంతో సన్మానించారు. శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కదిరి నుంచి తిమ్మమ్మ మర్రిమాను వారకు వేమన సాహితీ యాత్ర నిర్వహించారు. తిమ్మమ్మ మర్రిమాను వద్ద నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో తెలుగు భాషాభివృద్ధి పరిరక్షణకు చింతా నాగరాజు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు అవార్డు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రచయిత సంఘం నాయకులు జాబిలి చాంద్‌బాషా, చిన్నారావు, బాబాఫక్రుద్దీన్, శంకర్‌నారాయణరాజు, రాజశేఖర్, ఫారూక్, చదువుల బాబు, ఉద్ధడం చంద్రశేఖర్, గాయత్రిదేవి, ఉపాధ్యాయులు, రచయితలు, కవులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న రచయితలు, కవులు

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తాం

ధర్మవరంరూరల్ : మండలంలోని రావులచెరువు గ్రామంలోని ఎస్సీకాలనీలో త్వరలో విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేస్తామని మంత్రి కార్యాలయ సిబ్బంది హరీష్, మల్లికార్జున తెలిపారు. ఆ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో ఇళ్లమీద కర్రలతో, చెట్లమీద విద్యుత్ తీగలను ఏర్పాటు చేసుకున్నారు. దీనివల్ల ఏ క్షణానైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఇటీవల ధర్మవరం పర్యటనలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ఆ కాలనీవాసులు తీసుకెళ్లారు. దీంతో మంత్రి కార్యాలయ సిబ్బంది విద్యుత్ అధికారులతో కలిసి ఆదివారం ఆ కాలనీలో పర్యటించారు. విద్యుత్‌స్తంభాల ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి చెప్పాలని అధికారులకు సూచించారు.

జింకా అవినీతిపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం

సీపీఐ, చేనేత సంఘం నాయకులు

ధర్మవరం, ఆగస్టు 26 : చేనేత పరిశ్రమను నాశనం చేస్తున్న జింకా రామాంజినేయులుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర హ్యాండ్‌లూమ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని, ఈ మేరకు త్వరలో విజయవాడ వెళ్తామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ స్పష్టం చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. జింకా రామాంజినేయులు అత్యంత టెక్నాలజీ గల పవర్‌లూమ్స్‌ను ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా ఉత్పత్తులు నిర్వహిస్తూ తోటి నేతన్నల కడుపు కొడుతున్నారన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. మల్బరీ నుంచి గుడ్డు, రేషం దాకా అక్కడే తయారు చేస్తున్న దారాన్ని ఎక్కడికి తరలిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. చేనేత చట్టం ఉల్లంఘించకపోతే ఆ దారంను తయారుచేసి ఎక్కడికి తరలిస్తున్నారో.. ఏం చేస్తున్నారో.. చెప్పాలన్నారు. ఇలాంటి అక్రమాలు అరికట్టడానికి తిరుపతిలో ఉన్న ఎన్‌ఫోర్స్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రామకృష్ణను ఆహ్వానించి జింకా రామాంజినేయులు అక్రమాలు పుట్టగా మారిన చేనేత ప్రాజెక్టు వద్ద ధర్నాకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ అన్యాయంపై చేనేత మంత్రి సవిత, మరో మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం కార్యవర్గసభ్యులు ఆదినారాయణ, శ్రీదర్, శ్రీనివాసులు, బాలరంగయ్య, సురేశ్,సుబ్బయ్య, బాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

దోషులను శిక్షించాలి

ధర్మవరం : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని మానస నృత్యకళా కేంద్ర కళాకారులు కోరారు. సోమవారం రాత్రి ఎస్‌బీఐ కాలనీ నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దోషులను ఉరితీయాలని డిమాండ్ చేశారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కళాకారులు

నేడు సమావేశం

తనకల్లు, ఆగస్టు 26: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వికసిత్ భారత్‌పై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు ప్రణాళికలతో హాజరుకావాలని కోరారు.

నేడు ప్రజావేదిక బహిరంగ సభ

కదిరి, (అమడగూరు), ఆగస్టు 26 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునియప్ప సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఉపాధి నిధుల వినియోగంపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూలీలు హాజరుకావాలని కోరారు.

2న రక్తదాన శిబిరం

కదిరి అర్బన్, ఆగస్టు 26: జనసన సేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా వచ్చే నెల 2న స్థానిక ఎన్జీవో హోమ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు, నిర్వాహకులు కిన్నెర మహేష్ ఈటి లోకేష్, రవి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు డాక్టర్ హుస్సేన్‌ను కలిసి రక్తదాన శిబిరానికి కావాల్సిన సిబ్బంది, పరికరాలు సమకూర్చాలని కోరినట్లు పేర్కొన్నారు.

కళ్లకు గంతలతో సత్యసాయి కార్మికుల నిరసన

కొత్తచెరువు, ఆగస్టు 26: మండల కేంద్రంలోని సత్యసాయి తాగునీటి పంప్ హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యసాయి వాటర్‌సరఫరా విభాగపు జిల్లా కోశాధికారి రాము మాట్లాడుతూ.. తమకు ఆరు నెలలుగా జీతాలు రాలేదని, దీంతో తాము కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కార్మికులు భగవాన్, శ్రీనివాసులు, శంకర పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్న కేశవ పురం వద్దగల సత్యసాయి పంపు హౌస్ వద్ద ఐదో రోజైన సోమవారమూ కార్మికులు తమ నిరసన కొనసాగించారు. ఈ కార్యక్ర మంలో కార్మికులు రాజేంద్రరెడ్డి, కుమార్‌రెడ్డి, చంద్ర శేఖర్, నారాయణ; రామాంజినేయులు, రియాజ్‌బాషా, గంగాధర్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక సత్యసాయి నీటి పథకం పంప్‌హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. పెండింగ్ వేతనాలు మం జూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే సమస్యను పరిష్కారం చేయాలని కోరారు.



కొత్తచెరువులో పంప్‌హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు





ధర్మవరం, ముదిగుబ్బలో కళ్లకు గంతలు కొట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి తాగునీటి కార్మికులు

ప్రభుత్వ భూమి కబ్జాపై కేసు

కదిరి, ఆగస్టు 26: స్థానిక హిందూపురం రోడ్డులో ఉన్న సింహకోట వద్ద ఉన్న నాలుగు సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినవారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. ఆ స్థలాన్ని మూర్తిపల్లికి చెందిన రెడ్డెప్ప, జొన్నావీధిలో హరినాథ్ అలియాస్ పాల హరి ఐదు సంవత్సరాల క్రితం కబ్జా చేసి రేకుల షెడ్లు నిర్మించి, వాటిని అద్దెకిచ్చారు. ఆ స్థలం విలువ దాదాపు రూ. కోటి ఉంటుంది. దీన్ని గుర్తించిన మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ వారికి పలుమార్లు నోటీలు ఇచ్చినా ఖాళీ చేయలేదు. దీంతో సోమవారం ఉదయం ఆ రేకుల షెడ్లు, గదులను తన సిబ్బందితో తొలగిస్తుండగా రెడ్డెప్ప, హరి కమిషన్‌కు ఫోన్ చేసి, దుర్భాషలాడి బెదిరించినట్లు మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రెడ్డెప్ప, పాల హరిపై గ్యాబింగ్ కింద కేసు నమోదు చేశారు. కాగా ఇది జిల్లాలోనే మొదటిసారిగా ల్యాండ్ గ్యాబింగ్ కేసు అని, వీరిపై గతంలోనే రౌడీషీట్ ఉన్నట్లు పోలీసులు చెప్పారు.



కబ్జా చేసిన ప్రాంతంలో షెడ్లు తొలగిస్తున్న సిబ్బంది

వాగులో పడి యువకుడి మృతి

కదిరి అర్బన్, ఆగస్టు 26: మండలంలోని వీరేపల్లిపేట వద్ద ప్రమాదవశాత్తు మద్దిలేరు వాగులోపడి మహారాష్ట్రకు చెందిన నాన్‌దేవ్ (34) సోమవారం మరణించాడు. అతను మలకవేమల వద్ద జరుగుతున్న గ్రీన్‌ఫీల్డు హైవే పనుల్లో కూలిగా చేస్తున్నారు. సోమవారం వీరేపల్లిపేట వద్ద మద్దిలేరు వాగులో అతను ప్రమాదవశాత్తు పడ్డాడు. స్థానికులు అతన్ని బయటకు తీయగా.. అప్పటికే అతను మరణించినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. నాన్‌దేవ్ అవివాహితుడు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం

కదిరి అర్బన్, ఆగస్టు 26: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి వద్ద అక్రమంగా మట్టి తరిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ మోహన్ సోమవారం తెలిపారు. గంగన్నగారిపల్లికి చెందిన ట్రిప్పర్ డ్రైవర్ ఖానును అరెస్టు చేసి, ట్రిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

గుండెపోటుతో విశ్రాంత ఉద్యోగి మృతి

నల్లమాడ, ఆగస్టు 26: మండలంలోని నల్లశింగయ్యగారిపల్లికి చెందిన విశ్రాంత ఉద్యోగి శివయ్య గుండెపోటుతో సోమవారం మరణించాడు. కదిరి ఆర్టీసీ డిపోలో మెకానిక్ అయిన శివయ్య.. ఈ యేడాది ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ పొందారు. స్వగ్రామంలో ఉన్న అయన సోమవారం గుండె పోటుకు గురై మరణించాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కదిరి డిపో మేనేజర్ మైనోద్దీన్, రిటైడ్ ఉద్యోగుల సంఘం నాయకులు గోపాలక్రిష్ణ, బాషా, నరసింహరావు, సురేంద్రరెడ్డి తదితరులు అతని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



శివయ్య (ఫైల్)

రిమాండ్‌కు నిందితుడు

ధర్మవరంరూరల్ : మండలంలోని తుంపర్తి గ్రామంలో ఈనెల 12న టీడీపీ వర్గీయుడు శ్రీనివాసులుపై అదే గ్రామానికి చెందిన పరమేష్, నరసింహులు గొడ్డలితో దాడిచేశారు. దీనిపై బాధితుడు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం అర్ధరాత్రి తుంపర్తి గ్రామంలో ఉన్న పరమేష్‌ను రూరల్ పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం కోర్టుకు హాజరు పరచగా పరమేష్‌కు రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, ఆగస్టు 26 : తాడిమర్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఇంటర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువు తోంది. గత నెల 22న ఓ యువకుడి తన చెల్లెలు అని చెప్పి ఆ యువతిని పిలుచుకెళ్లాడు. కొద్దిరోజుల తర్వాత గుర్తించిన ఆ యువతి తల్లిదండ్రులు ఆమె కోసం గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో అనం తపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి

వేడుకల్లో పాల్గొన్న మంత్రి సవిత


ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి

పెనుకొండ, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను పట్టణంలోని అతిపురాతనమైన వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హాజరై పూజల్లో పాల్గొన్నారు. మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వెండి రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో విద్యామందిరం విద్యార్థులు, కోలాటం, చెక్కభజన బృందాలు, వివిధ వాయిద్యకారులు ముందునడవగా స్వామివారి ఊరేగింపు పురవీధుల్లో ఘనంగా సాగింది. మంత్రి సవిత రథాన్ని స్వయంగా నడపడం, శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో చిన్నికృష్ణుల ఉట్టికొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు రాంప్రసాద్, కోగిర జయచంద్ర, మునెప్ప, ఆంజనేయులు, మోహనక్రిష్ణ, టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్, రమణమ్మ, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కృష్ణతత్వాన్ని అలవరచుకోవాలి: మంత్రి

పెనుకొండ: ఎలాంటి పరిస్థితులు వచ్చినా నిలకడగా ఉండడం, గెలుపోటములు సమానంగా తీసుకోవడం, కష్టసుఖాల్లో తటస్థంగా ఉండటం శ్రీకృష్ణతత్వమని మంత్రి సవిత అన్నారు. సోమవారం కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఆమె భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత మానసిక ఒత్తిడిలకు గురైన బాధపడుతున్నారన్నారు. వాటి నుంచి ఉపశమనం పొందడానికి యువత శ్రీకృష్ణతత్వాన్ని అలవరచుకోలన్నారు.


ఊరేగింపులో కోలాటం వేస్తున్న కళాకారుల బృందం

వేమన సాహితీ పురస్కారంతో సత్కారం


పురస్కారంతో కోగిర జయచంద్రను సత్కరిస్తున్న దృశ్యం

పెనుకొండ, ఆగస్టు 26: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కదిరి నియోజకవర్గం కటారుపల్లి తిమ్మమ్మ మర్రిమాను వద్ద నిర్వహించిన వేమన సాహితీయాత్ర కార్యక్రమంలో భాగంగా కవులు కళాకారులు సాహిత్యవేత్తలను వేమన సాహితీ పురస్కారంతో సత్కరించారు. అందులో భాగంగా తనను కళాకారుడిగా, సాహితీసేవకుడిగా గుర్తించి వేమన సాహితీ పురస్కారం అందజేసినట్లు పెనుకొండకు చెందిన కోగిర జయచంద్రను తెలిపారు. కటారుపల్లిలో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత చదువులబాబు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, శంకర నారాయణరాజు, చిన్నరావు, బాబాఫక్రుద్దీన్, ఉమర్‌ఫారూక్ చేతులమీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


పార్థ (ఫైల్)

పెనుకొండ రూరల్, ఆగస్టు 26: రొద్దం మండలంలోని కుర్లపల్లిలో పాముకాటుతో బోయ పార్థ(30) అనే వ్యక్తి సోమవారం మృతిచెందినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. కుర్లపల్లి గ్రామానికి చెందిన పార్థ బెంగళూరులో బేకరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పరుపులో దూరి పాముకరిచింది. వెంటనే గుర్తించిన బంధువులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

గోరంట్ల, ఆగస్టు 26: మండలంలోని కరావులపల్లి శివారు ప్రాంతంలో పేకాడుతున్న 12మందిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో 12మందిని అరెస్టు చేసి, వారి వద్దనుంచి రూ.73,370 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మడకశిరటౌన్, ఆగస్టు 26: పట్టణంలోని శివాపురం వద్ద ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొనడంతో చౌటిపల్లికి చెందిన శివన్న అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. చౌటిపల్లికి చెందిన శివన్న సోమవారం ఉదయం పావగడ వైపు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శివన్న తీవ్రగాయాలయ్యాయి. అతడిని స్థానికులు మడకశిర ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు చౌటిపల్లి వాసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెనుకొండ రూరల్, ఆగస్టు 26: రొద్దం మండలంలోని చెరుకూరులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వలీబాష తెలిపారు. పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

హిందూపురం(పరిగి), ఆగస్టు 26: పరిగి మండలం కొడిగెనహళ్లి అంగనవాడీ కేంద్రంలో ఆదివారం చోరీ జరిగింది. అంగనవాడీ కేంద్రంలోని గ్యాస్ సిలెండరు, పాలప్యాకెట్లు, కోడిగుడ్లు తదితరవాటిని చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఓ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజాన్ని ఒప్పుకున్నాడని, దొంగలించిన వస్తువులను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో పట్టుచీరల వ్యాపారి మృతి


పల్లా లక్ష్మీనారాయణ (ఫైల్)

హిందూపురం అర్బన్, ఆగస్టు 26: పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన పట్టుచీరల వ్యాపారి పల్లా లక్ష్మీనారాయణ(74) సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందాడు. గతంలో ప్రజారాజ్యం పార్టీకి ఎమ్మెల్యే అభ్యర్థిగా హిందూపురం నుంచి పోటీచేశారు. మృతుడికి ముగ్గురు కుమారులుండగా.. ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పలువురు సంతాపం ప్రకటించారు.


పురం వాసవీ ధర్మశాలలో భగవద్గీత పారాయణం


పురం వేణుగోపాలస్వామి ఆలయంలో మూలవిరాట్


వేణుగోపాలస్వామి ఊరేగింపు

కృష్ణం.. వందే జగద్గురుమ్..!


మేరెడ్డిపల్లిలో వేణుగోపాల స్వామి


చిలమత్తూరులో కృష్ణుడి ఉత్సవ విగ్రహం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే అభిషేకాలు, అర్చనలు, అలంకరణ తదితర ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల రుక్మిణి, సత్యభామ సమేత స్వామి కల్యాణోత్సవాలను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. హిందూపురంలోని వాసవీ ధర్మశాలలో ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మస్థానం మధుర నుంచి విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గోరంట్లలోని పురాతన మాధవరాయ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలకు జడ్పీ మాజీ చైర్మన్ చమన్ సాబ్ తనయుడు డాక్టర్ ఉమ్మర్ ముక్తార్, వీహెచ్‌పీ నాయకుడు వేదవ్యాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


పురం వేణుగోపాలస్వామి ఆలయంలో తిరు కల్యాణ వేడుకలు


ఇస్లాపురంలో కృష్ణుడి పూజ చేస్తున్న దృశ్యం


లేపాక్షిలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు


సోమందేపల్లిలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు


చత్రంలో వేణుగోపాల స్వామిని ఊరేగిస్తున్న భక్తులు


గౌడనహళ్లిలో వేణుగోపాల స్వామి పూజల్లో పాల్గొన్న మహిళలు


మోడల్ కాలనీలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు


ముద్దిరెడ్డిపల్లి ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు


గోరంట్లలో మాధవరాయ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు


గోరంట్లలో ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో...


గోరంట్లలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


శ్రీకృష్ణ గోపికల వేషధారణలో పెనుకొండ విద్యామందిరం విద్యార్థులు


మడకశిర: జ్యోతులను మోసుకొస్తున్న మహిళలు


రొళ్ల: గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు


అమరాపురంలో జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రజలు


మడకశిరలో శ్రీకృష్ణుడు


పావగడలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు


అగళి పూలపల్లిలో పూజల్లో పాల్గొన్న జడ్పీటీసీ ఉమేష్ తదితరులు


అగళి మండలం పూలపల్లిలో జ్యోతులను మోసుకొస్తున్న మహిళలు

'పర్యాటకులకు భద్రత కల్పించండి'

లేపాక్షి, ఆగస్టు 26: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయానికి వచ్చే పర్యాటకులకు భద్రత కల్పించాలని ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ సోమవారం హిందూపురం రూరల్ సీఐ జనార్దన్‌ను కోరారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన రూరల్ సీఐ జనార్దన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నంది విగ్రహం వద్ద రూ. లక్షలు వెచ్చించి పోలీస్ ఔట్‌పోస్టు నిర్మించారని అందులో సిబ్బంది ఉండడం లేదన్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఆలయానికి భక్తులు, పర్యాటకుల సంఖ్య అధికంగా ఉం టుందన్నారు. సెల్‌ఫోన్‌ల చోరీలు జరుగుతున్నాయని, సిబ్బంది పర్యవేక్షిస్తే తగ్గుముఖం పడతాయన్నారు. సీఐ స్పందిస్తూ తప్పక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చెట్లే ప్రగతికి మెట్లు

హిందూపురం అర్బన్, ఆగస్టు 26: విరివిగా చెట్లు ఉంటేనే క్షేమమని లేకుంటే క్షామమని, చెట్లు ప్రగతికి మెట్లని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మొక్కలను నాటి మాట్లాడారు. కాలక్రమేణ అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయడంతో వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

రాజకీయాలను కులాలకు ఆపాదించొద్దు

టీడీపీ వక్కలిగ సంఘం నాయకులు


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ బసవరాజు

మడకశిరటౌన్, ఆగస్టు 26 : నియోజకవర్గంలో అందరూ సోదర భావంతో ఉన్నామని, కొందరు ఉద్దేశ పూర్వకంగా రాజకీయాలను కులాలకు అపవాదించి లబ్ధి పొందాలని చూస్తున్నారని టీడీపీ నియోజకవర్గం వక్కలిగ సంఘం నాయకులు అన్నారు. టీడీపీ మడకశిర, అగళి, అమరాపురం మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, గణేష్ తదితరులు సోమవారం రాత్రి బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీకి చెందిన కరుణాకర్ అనే వ్యక్తి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు. ఆవిషయ మై గుండుమల తిప్పేస్వామి సోదరుడు జయప్ప ప్రశ్నించినందుకు... తమపై దాడి చేశారని ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ, కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అది మంచిది కాదన్నారు. వక్కలిగ సంఘం నాయకులు మాజీ ఎంపీపీ బసవరాజు, శ్రీనివాసులు, విశ్వనాథ్, శివకుమార్, మంజునాథ్, తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్‌ల మరమ్మతులకు నేడు, రేపు స్పెషల్ డ్రైవ్: ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఆగస్టు 26: నియోజకవర్గంలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేయించేందుకు మంగళ, బుధవారాల్లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం విలేకరులకు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో గ్రామస్థాయిలో తాగునీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్‌లను పరిశీలిస్తామన్నారు. అవసరమైన చోట్ల యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి అందుకు సంబంధించిన పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీఓ ఇతర పంచాయతీ అధికారులతో కలిసి రెండు రోజులపాటు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పైప్‌లైన్ మరమ్మతులను చేయించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు రొళ్ల మండలం రత్నగిరి, గుడ్డగుర్కి గ్రామాల్లో తాను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి దెబ్బతిన్న పైప్‌లైన్‌లను పరిశీలించనున్నట్లు తెలిపారు. అధికారులు ఇతర గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. టీడీపీ స్థానిక నాయకులు అందుబాటులో ఉండి మరమ్మతులకు గురైన పైప్‌లను గుర్తించి అధికారులకు తెలపాలని కోరారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?

రొళ్ల, ఆగస్టు 26 : మండలంలోని మల్లినమడుగు గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో... ఆ నీరు నిలిచి ఉన్న చోట పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దానిని ఎవరూ పట్టించుకుని మరమ్మతులు చేసిన పాపాన పోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాకె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ నీటిని తాగడం వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు. వెంటనే అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీని సరిచేసి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారంటున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి తమ ప్రాణాలు కాపాడాలని ఎస్సీ కాలనీ ప్రజలు కోరుతున్నారు.


లీకేజీ నీటిలో పందుల విహారం

కొందరి స్వార్థంతో రోడ్డునపడ్డ లారీ యజమానులు

అసోసియేషన్ నాయకుల ఆవేదన


మాట్లాడుతున్న లారీ అసోసియేషన్ నాయకులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 26: ఎన్టీఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్క లారీ యజమాని ముందుకు రావాలని హిందూపురం లారీ యజమానుల అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. వారు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో హిందూపురం ప్రాంతం అత్యంత వెనుకబ డిందని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గుర్తించి, ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. అందులో లారీ వ్యవస్థ ఒకటన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద లారీ యూనియన్ విజయవాడ మొదటి స్థానంలో ఉండగా హిందూపురం రెండో స్థానంలో ఉందన్నారు. ఇక్కడ లారీ యూనియన్ పటిష్టంగా పని చేసిందని, అప్పుడు ఇక్కడి లారీ యజమానులు సంతోషంగా జీవించారని పేర్కొన్నారు. అయితే ఓ ముగ్గురు వ్యక్తులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం లారీ బ్రో కర్ ఆఫీసులను సొంతంగా ప్రారంభించి పటిష్టమైన వ్యవస్థను కుప్పకూల్చారని ఆరోపించారు. కంతులు కట్టలేని పరిస్థితుల్లో ఫైనాన్స్ కంపెనీ వారు లారీలను సీజ్ చేసి తీసుకెళ్లారన్నారు. ఈ విషయం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి తన తండ్రిగారి ఆశయాలను కొనసాగిద్దామని లారీ యూనియన్‌కు భరోసా కల్పించారన్నారు. దీంతో 80 శాతం సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ఎమ్మెల్యే బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఆ ముగ్గురు వ్యక్తుల గురించి అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులుకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇందాద్, మల్లికార్జున, క్రిష్ణారెడ్డి అయూబ్, మజీద్, హాఫీజ్, రహమత్ తదితరులు ఉన్నారు.

నిడిగల్ ఉత్సవాలకు పావగడ ఎమ్మెల్యేకి ఆహ్వానం

పావగడ, ఆగస్టు 26 : తాలూకాలోని నిడిగల్ దుర్గంలో సెప్టెంబర్ 2న నిర్వహించే ఉత్సవా లకు పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌ను వాల్మీకి నాయకులు ఆహ్వానించారు. వారు సోమవారం ఎమ్మెల్యేను కలిశారు. ప్రతి సంవత్సరంలాగే ఈ యేడాది కూడా నిడిగల్ దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా ఆ ప్రాంతానికి రవాణా సౌకర్యం కల్పించాలని, ప్రాచీన ఆలయాలు, మండపాలు, రాజగోపురాల పునరుద్ధరీకరణకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాలేకర్ లోకేష్ కోరారు. మాజీ మంత్రి వెంకటరమణను కూడా ఈ కార్యక్రమానికి స్వాగతించినట్లు తెలిపారు. పలువురు వాల్మీకి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.